# నా స్మృతి పథంలో ఒక రోజు

- శ్రీమతి మాచిరాజు లక్ష్మి గంగా భవాని.

*గత సంచికలలో ...*

*మద్రాసు (నేటి చెన్నై), అలనాటి చెన్నపట్నం)లో బోర్డింగ్ అయ్యాక మాకై నిర్దేశించిన సీట్లలో కూర్చున్నాం! స్థూల శరీరంతో చేసి, సూక్ష్మ శరీరంమీద పడిన ముద్రలు చివరి మజిలీ వరకు చెరిగిపోవు. మద్రాసులో కంప్యూటర్‌లోకి ఎక్కిన సమాచారం, సింగపూర్ వెళ్ళినా, అమెరికాలో అడుగుపెట్టినా మారదు. చెక్కుచెదరకుండా అలాగే రికార్డయి వుంటుంది. సింగపూర్ చేరిన తరువాత రెండు వీధులంత పొడవుగల హాలంతా నడిచివెళ్ళి కాఫీ తీసుకున్నాము. పెద్ద కప్పుతో డికాక్షన్ ఇచ్చారు. అదే కాఫీ అనుకుని, పంచదార కలుపుకుని, "ఇప్పట్నించి బ్లేక్ కాఫీ అలవాటు చేసుకోవాలేమో!" అనుకున్నాము.* అక్కడ చాలా సేపు నిరీక్షించి విసుగు కలిగింది. చివరకు నాలుగుంపావుకు ఒక అమ్మాయి వచ్చి 'ఫాలో మి' అంది.

## శ్రీ గురుభ్యోనమః
## అమెరికా ప్రయాణంలో అనుభవాలు

సొంత ప్రయత్నంతో, మలాలతో కూడుకుని (త్రికరణశుద్ధిలేక), భ్రష్టు పట్టేకన్నా "నాకేం తెలియదు, నీ కరుణ తప్ప నాకేం అక్కరలేదు" అని గురువుని, భగవంతుణ్ణి ఆశ్రయిస్తే, శ్రమలేకుండా జీవుడు ఉత్తీర్ణుడు అయినట్టు అనిపించింది. ఒక యజ్ఞం పూర్తి అయినట్టు అయింది. భారత కాలమానం ప్రకారం, మధ్యాహ్నం 2 గంటలకు మొదలై 2 గంటల 10 నిమిషములకు అమెరికా విమానములో అడుగుపెట్టాం. మద్రాసులో లాగానే చేతులు, ముఖము తుడుచుకోవడం కోసం తెల్లని నేప్‌కిన్‌లు ఇచ్చారు. 2 గంటల 45 నిమిషములకు పైకి లేచింది. నడచినప్పుడు 4 నిమిషాలు స్లోగా వెళ్ళి, 1 నిమిషములో స్పీడుగా పైకి లేచింది. అదృష్టవశాత్తూ కిటికీ ప్రక్కన సీటు వచ్చింది. ఆ సదవకాశాన్ని వినియోగించుకున్నాను. ఎయిర్ హోస్టెస్‌లు వాళ్ళ డ్యూటీ ప్రకారము అన్నీ వరుసగా అందించారు. మద్రాసులో కంప్యూటర్‌లో రికార్డయిన ప్రకారం, మాకోసం నిర్ణయించిన ఆహారం, మాసీటు నెంబరు వేసి వున్న రకరకాల పదార్థాలు అందంగా చిన్నచిన్న ప్లాస్టిక్ డబ్బాల్లో అమర్చిన ట్రేలు మాముందు వుంచారు. పగలు భోజనం చెయ్యలేదు కనుక తీసుకున్నాం.

ప్రయాణం మొదలైన కొద్ది నిమిషాల్లోనే పట్టణ దృశ్యాలు అదృశ్యం అయి రత్నగర్భ, జలరూపిణి, సాగరమేఖలగా (పసిఫిక్ మహాసముద్రం) దర్శనం అయింది. నిర్మలమైన ఆ జలరాశిని చూస్తుండగనే,

ఉవ్వెత్తుగా ఆకాశమార్గాన పైపైకి దూసుకుపోతున్న విమానం కాస్సేపట్లో సూర్యుడి పక్కన వున్నట్టు, సూర్యుడితో పాటు ప్రయాణం చేస్తున్నట్టు, అద్భుతంగా వుంది. సూర్యుడి పక్కన విమానం ఆగిపోయినట్టు, కదలికలేనట్టు అనిపించింది. అగాధంగా వున్న సముద్రంలోకి చూస్తే అప్పుడప్పుడు కలిగే మార్పుల వలన విమానం ప్రయాణం చేస్తున్నట్టు తెలుస్తోంది కాని, లేకపోతే అక్కడే వున్నట్టు అనిపిస్తుంది. ఇంక ఆ ప్రకృతి వైభవాన్ని వర్ణించడానికి, "శ్రీమద్ వాగ్భవ కూటైక స్వరూపముఖ పంకజ" అయిన అమ్మ అనుగ్రహం ప్రసారం అయితేనే సాధ్యంకాని, లేకపోతే అసాధ్యమే! ఒక్కొక్కసారి ఒక్కొక్క దర్శనం అయ్యేది.

సూర్యబింబం సముద్రంలో కనబడి ఆ వెలుగు నీటికిందన పరుచుకుని వుండి, ఆ వెలుగుపైన సముద్రజలం అద్దంపెట్టినట్టు వుండి, ఆ పైన తెల్లని గుండ్రని మబ్బులు గుట్టలు గుట్టలుగా పేరుకుని నాగలోకంలా అనిపించింది. కాస్సేపటికి సముద్ర మధ్యంలో, సినిమాలో చూపించే దేవలోకపు మబ్బులగుంపు, ప్రక్కన నిర్మలమైన జలంలో సూర్యబింబం, అంతలోనే ప్రక్కనే మబ్బుల్లాంటి నీరు. సెకెండుకి మారిపోతోందా! అన్నట్టు రకరకాల దర్శనాలు. సముద్రంలో షిప్పులు, పిల్లలు నీళ్ళలో వేసిన కాగితం పడవల్లా కనిపించేవి. అక్కడక్కడ రకరకాల జలజంతువులు, పక్షుల రూపాల్లో మబ్బులు నీటిమీద ప్రయాణం చేస్తున్నట్టుగా వుంది. అవి నీటి మీద మబ్బులు కాదు. కిందినుంచి పైకి ఆకాశంలోకి వున్నట్టు కనిపించే మేఘాలే, పైనించి సముద్రం మీద వున్నట్టు కనిపిస్తున్నాయి. అంతలోనే అంతా పొగమయం. ముందు తెలియలేదు. తరువాత అర్థం అయింది. విమానపు రెక్క దగ్గర నుంచి వస్తున్న పొగ అని. అర క్షణంలో మళ్ళీ సముద్రంలో దర్శనాలు. నిర్మలంగా వున్న సముద్రం మీద సన్నని, పల్చని, మబ్బుల ప్రయాణం, అద్దంమీద నీళ్ళు పోసినట్టువుంది.

అంతలో పెద్ద ప్రవాహంలా, మబ్బుల ప్రయాణం, మధ్యలో వుండిపోయిన చిన్న చిన్న మబ్బులు ముందువెళ్ళేవాటిని చేరుకోవాలని, చాలా హడావిడిగా పరుగెడుతున్నాయి. కింద సముద్రం మీద ఆ మబ్బుల సమూహం ఎలా వుందంటే; చల్లని వేళ ఆరుబయట వెల్లకిలా పడుకుని ఆకాశంవైపు చూస్తే ఎలా వుంటుందో; అలా వుంది. ఒక్క నిమిషములో సముద్రం అంతా కనుచూపుమేర మంచు గుట్టలు పరచినట్టు వుంది. వింత అయిన అందం. ఒక్కసారి విమానం క్రిందికి దిగినట్టు అయింది. నిండా మునిగిన వాడికి చలేమిటి? అన్నట్టు భయం అని, అనిపించలేదు. సరికదా, ఆ అందాలు ఇంకా ఇంకా చూడాలనే అనిపించింది. ఇంకో చోట సముద్రంలో దూరంగా చిన్న చిన్న మబ్బులు బదరి, కాశ్మీర్, లాంటి ఘాట్ రోడ్డులో ప్రయాణం చేస్తున్నప్పుడు దూరంగా చాలా దిగువలో వుండే చిన్న చిన్న గ్రామాల్లా కనిపిస్తున్నాయి. ఆ ప్రక్కనే నిర్మలంగా వున్న స్వచ్ఛమైన నీటిలో తెల్లని మబ్బుల గుంపు సింహాల ఆకారంలో అన్నీ ఒకే మాదిరిగా సూర్యుడివైపు తిరిగి, వంగి, నమస్కరిస్తున్నట్టుగా వుంది. ఇంకో వైపు మబ్బు పెద్ద పర్వతంలాగ, దాని చుట్టూ చిన్న చిన్న మబ్బులు, చిన్నచిన్న కొండల్లాగ వున్నాయి.

*(తరువాయి భాగం సంక్రాంతి సంచికలో)*